ఏనుగులను కుంకీలు అదుపు చేశాయా..?

- మునలిమొడుగు ప్రాంతానికి మళ్లించాయట!
- ఏనుగులు పంటలపై పడిన ప్రతిసారీ ఇదే పనా?
- ఇలాగైతే మదపుటేనుగు కట్టడి సాధ్యమేనా? అని ప్రశ్నిస్తున్న రైతులు


ఇటీవల టేకుమంద అడవిలోకి కుంకీ ఏనుగులను పంపుతున్న దృశ్యం

పలమనేరు: పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలోని టేకుమంద బీట్‌లో నాలుగు రోజులుగా ఏనుగులను మళ్లించేందుకు కుంకీ ఏనుగులతో నిర్వహించిన ఆపరేషన్ విజయవంతమైందని అటవీశాఖ అధికారులు చెబుతుండగా, మరోవైపు- అడవిలోంచి పంటల వైపు ఏనుగులు వస్తున్నాయని తెలిస్తే కుంకీలతో వాటిని మళ్లించడం తప్పితే మదపుటేనుగులను కుంకీలతో అదుపుచేసి, వాటిని ఎప్పుడు కట్టడి చేస్తారనే మాట బాధిత రైతుల నుంచి వినిపిస్తోంది. కుంకీలతో అడవిలోని మదపుటేనుగులకు మత్తుసూదిచ్చి, వాటిని ఇక్కడి ఎలిఫెంట్ క్యాంపులో శిక్షణ ఇచ్చి, అవి మళ్లీ అడవిలోకి వెళ్లకుండా చేయాలన్నదే దీని లక్ష్యం. కానీ అధికారులు అడవిలోంచి వచ్చే ఏనుగులను మళ్లించినంత మాత్రాన అవి మళ్లీ పంటలపైకి రావనే గ్యారెంటీ ఏమీ లేదని రైతులు నిట్టూరుస్తున్నారు.

సోమల ఎఫెక్ట్‌తోనే కుంకీలు అడవిలోకి..

తాజాగా సోమల మండలం కొత్తూరు పొలం వద్దనున్న కృష్ణంరాజు అనే రైతును ఏనుగులు తొక్కిచంపడం విదితమే. దీంతో అక్కడి రైతులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఏనుగులకు కట్టడి చేసేందుకు తెచ్చిన కుంకీ ఏనుగులు ఎందుకు రంగంలోకి దింపలేదని తీవ్రంగా ప్రశ్నించారు. దీనిని కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీంతో జిల్లా అటవీశాఖ అధికారులపై రావడంతో ఇక్కడి ఫారెస్ట్ అధికారులు టేకుమంద ప్రాంతంలో ఏనుగుల గుంపు ఉందనే సమాచారంతో మూడు కుంకీ ఏనుగులను మావటీలతో సహా నాలుగురోజుల క్రితం అడవిలోకి పంపారు. ఇవి అడవిలోకి వెళ్లి అక్కడున్న ఎనిమిది ఏనుగుల గుంపును మునలిమొడుగు అడవిలోకి పంపినట్టు అధికారులు తెలిపారు. ఎలిఫెంట్ క్యాంపులోని ఆరు ఏనుగులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు మరికొన్ని నెలలవుతున్నా అటవీశాఖ హఠాత్తుగా కుంకీలను అడవిలోకి దింపడం..కేవలం ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకేననే మాట వినిపిస్తోంది. మొత్తం మీద అడవిలోని ఏనుగులను కుంకీలు అదుపులోకి తీసుకునేదెప్పుడు? శాశ్వతంగా ఏనుగుల సమస్య తప్పేదెప్పుడు? అని అటవీ సమీప గ్రామాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ విషయమై స్థానిక సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, ఎఫ్ఆర్వో నారాయణలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

గడువు లోపు కోరిన సమాచారమివ్వాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ లీలామాధవి

చౌడేపల్లె: సమాచార హక్కు చట్టం కింద ప్రజలు అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువులోపు అందజేయాలని ఎంపీడీఓ లీలామాధవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. చట్టంలో పొందుపరిచిన అంశాలను వివరించారు. దరఖాస్తు చేసుకున్న పౌరులకు సమాచారాన్ని అందజేసి తగిన రశీదు పొందాలన్నారు. సమావేశంలో ఏఓ షబ్బీర్‌అహమ్మద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించరూ!

పలమనేరు/కుప్పం: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్థానిక పాత్రికేయులు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. మంగళవారం జర్నలిస్టుల డిమాండ్ డే సందర్భంగా అధికారులను కలిశారు. అలాగే కుప్పంలో తహసీల్దార్ చిట్టిబాబుకు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్ట్ సంఘ నేతలు కోటి, శ్యామ్, రెడ్డెప్ప, దిలీప్ తదితరులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం జర్నలిస్ట్‌లకు అక్రిడిటేషన్లు ఇవ్వకుండా జాప్యం చేస్తోందన్నారు.పొరుగునే ఉన్న తమిళనాడులో అక్కడి ప్రభుత్వం జర్నలిస్టులకు పింఛన్లు ఇస్తోందని, కూటమి ప్రభుత్వం కూడా ఇదే కోవలో ఇవ్వాలన్నారు. జర్నలిస్టులతో పాటు కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందేలా హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే నాయకులు, పలమనేరు ప్రెస్‌క్లబ్ సభ్యులు మణి, రమేష్, ఆది, మునిరత్నం, రామచంద్రారెడ్డి, కుప్పంలోని జర్నలిస్టులు వెంకటాచలం, ఆస్గాగర్, ఆనంద్, గోపి, ఉదయ్ రెడ్డి, నాగరాజ్, బసవశంకర్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ


జయరాం నాయక్ సీఐ

రొంపిచెర్ల: చట్టాలకు లోబడే ప్రతి ఒక్కరూ పని చేయాల ని కల్లూరు సీఐ జయరామ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన బాధ్యతల స్వీకరణ అనంతరం రొంపిచెర్ల పోలీసు స్టేషన్ తనిఖీ చేశారు. ప్రజలు ఫ్రెండ్లీ పోలీసు వాతావరణాన్ని అలవరచుకోవాలన్నారు. పోలీసులు చోరీల నివారణకు గ్రామాల్లో రాత్రి పూట గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో సత్తా చాటారు


ఆపిఫాఅంజుమ్, సత్య, సారా ఫాతిమ, జాహ్నవి

గంగవరం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సంవత్సరం 1వ సెమిస్టర్ ఫలితాల్లో మదర్‌థెరిసా డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్టు కరస్పాండెంట్ రవీంద్రబాబు మంగళవారం తెలిపారు. బీసీఏలో ఆపిఫా అంజిమ్(9.55), సత్య(9.50), సుహితశ్రీ(9.45), పూర్ణిమ(9.40), రమ్యశ్రీ(9.30), గీష్మ(9.30), జయకృష్ణ(9.25), దీపిక(9.25), పల్లవి(9.15), చందన(9.15), బీబీఏలో సారా ఫాతిమా(9.55), ఆయేషాభాను(9.00), బీకాంలో జాహ్నవి(9.35), పావని(9.10), సుస్మిత(9.05), సురేఖ(9.05), ప్రదీప(9.00), బీఎస్సీలో శ్రీవల్లిక(8.35), గౌతమి(8.30) జిఎస్‌జిపిఏ సాధించి కళాశాల స్థాయిలో టాపర్లుగా నిలిచారన్నారు. బీబీఏ, బీకాం, బీఎస్సీ, మొదటి సంవత్సరం 1వ సెమిస్టర్‌లో 253 డిస్టింక్షన్లు, 165 ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూధన్‌రావు, అధ్యాపకులు అభినందించారు.

పెరటి కోళ్లు పంపిణీ


పెరటికోళ్లను పంపిణీ చేస్తున్న ఏపీఎం లావణ్య, నాయకులు

వి.కోట: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు పెరటికోళ్లను ఇస్తోందని వెలుగు ఏపీఎం లావణ్య అన్నారు. మంగళవారం మహిళా మండల సమాఖ్య (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో మహిళలకు పెరటికోళ్లను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని సంఘ సభ్యుల ఆదాయ అభివృద్ధితోపాటు గర్భిణులు, చిన్న పిల్లలకు తక్కువ ఖర్చుతో పోషక విలువలతో కూడిన ఆహారం నిమిత్తం ప్రభుత్వం ఈ పెరటికోళ్లను ఇస్తోందని పేర్కొన్నారు. వీటి పెంపకంతో ఆదాయం కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, సీసీలు రామకృష్ణ, కాంతారావు, వెంకటేష్, రవికుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

శిశువుకు ముర్రుపాలే మొదటి టీకా


రొంపిచెర్ల: మాట్లాడుతున్న సీడీపీఓ వాణి శ్రీదేవి


సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రొంపిచెర్ల: అప్పుడే జన్మించిన శిశువుకు ముర్రుపాలే మొదటి టీకాలాంటిదని పులిచెర్ల సీడీపీఓ వాణి శ్రీదేవి అన్నారు. మంగళవారం తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బండకిందపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన గంట లోపు ముర్రు పాలు పట్టించాలని, ఈ పాల వల్ల శిశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఎలాంటి రుగ్మతలైనా తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. అనంతరం రెండు సంవత్సరాల వరకు తల్లి పాలతోపాటు అనుబంధ పోషకాహారం పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్ తహసీరా, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

తల్లి పాలే శిశువుకు అమృతం

సదుం: తల్లిపాలే శిశువుకు అమృతంతో సమానమని డాక్టర్లు చరణ్, గాయత్రి తెలిపారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం చెరకువారిపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముర్రుపాలలో ఉన్న పోషకాలు, వాటి ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నీలకంఠ, జానకి, శిఖామణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


పంటలపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమార్

రొంపిచెర్ల: పంటలు సాగు చేసిన రైతులు విధిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని పుంగనూరు ఏడీఏ శివకుమార్ కోరారు. మంగళవారం మండలంలోని బండకిందపల్లె గ్రామ పంచాయతీలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఆయన మాట్లాడారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాల ఫలాలు అందుతాయన్నారు. అలాగే కౌలుకు సాగు చేసే రైతులు కౌలు రైతు సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండలంలో 4,341 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో రూ.5 వేలు, పీఎం కిసాన్ పథకంలో మరో రెండు వేలు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని, ఈ సొమ్మును పంటల సాగు కోసం ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శ్రావణి, ఎంపీఈఓ హేమలత, ఏఈఓ సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బందికి సత్కారం


ఆరోగ్య సిబ్బందిని సత్కరిస్తున్న వైద్యాధికారులు అరుణ్‌కుమార్, పద్మావతి

బైరెడ్డిపల్లె: తీర్థం పీహెచ్‌సీలో ఉద్యోగ విరమణ పొందిన ఆశా వర్కర్ కౌసర్‌బేగం, దేవదొడ్డి సచివాలయం నుంచి తవణంపల్లె పీహెచ్‌సీకి బదిలీ అయిన వినాయకమ్మను మంగళవారం ఆరోగ్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. వైద్యాధికారి అరుణ్‌కుమార్, సిబ్బంది వారి సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పద్మావతి, హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, పీహెచ్‌ఎన్ శమంతక, హెచ్‌ఎస్ తిరుమలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సాయి దివ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా-శిశు సంక్షేమమే లక్ష్యం

-రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమాల


మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమాల

గంగవరం: మహిళా-శిశు సంక్షేమమే లక్ష్యంగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది పనిచేయాలని చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమాల ఆదేశించారు. పలమనేరు నియోజకవర్గంలో మంగళవారం విస్తృతంగా ఆమె పర్యటించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి నిర్వహిస్తున్న సమావేశానికి ఆమె ఆకస్మికంగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో గర్భిణులు నెలలు నిండి కాన్పు దశ వరకూ ప్రతి నెలా పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించి తల్లి, బిడ్డకు ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా కాపాడాలన్నారు. అలాగే రక్తహీనత తక్కువగా ఉన్న వారిపై దృష్టి పెట్టి వారికి అదనపు పోషకాహారం, ఐరన్ మాత్రలు తరచూ అందజేయాలన్నారు. మాతా-శిశు మరణాలను పూర్తిగా అరికట్టాలని తల్లి, బిడ్డ ఇద్దరిలో ఏ ఒకరి ప్రాణం పోయినా కిందిస్థాయి అధికారి నుంచి కలెక్టర్ వరకూ అందరికీ సమాధానం చెప్పాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో వైద్య సేవలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. వైద్యాధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోలతో సరి సరి..!


పెద్దకొండామర్రిలో పాఠశాల విద్యార్థులతో కలిసి ఫొటో తీసుకునేందుకు నిలబడిన దృశ్యం

చౌడేపల్లె: మనమిత్ర యాప్‌తో ప్రజలు వివిధ సేవలను వాట్సాప్‌లో పొందవచ్చని ఉన్నతాధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం పెద్దకొండామర్రిలో పంచాయతీ కార్యదర్శి నీలావతి దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి బదులు ఒకరిద్దరు స్థానికులతోపాటు సిబ్బంది ఇద్దరు కలిసి ఫొటోలు తీసుకోవడానికే పరిమితమయ్యారు. అంతేకాకుండా సచివాలయం పక్కనున్న పాఠశాల చిన్నపిల్లలతో కలిసి ప్రచారం చేస్తున్నట్టు ఫొటోలు తీసుకోవడం విమర్శలకు తావిచ్చింది.

డిగ్రీ ఫలితాల్లో వాణి, పద్మావతి విద్యార్థినుల ప్రతిభ


డిగ్రీ ఫస్ట్ సెమ్‌లో మంచి ఫలితాలను సాధించిన విద్యార్థినులు

పలమనేరు: డిగ్రీ ప్రథమ సంవత్సర తొలి సెమిస్టర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన శ్రీవాణి, పద్మావతి డిగ్రీ కళాశాలల విద్యార్థులు మంచి ప్రతిభను చూపినట్టు కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి రెడ్డి మంగళవారం తెలిపారు. బీసీఏలో ఆయేషా తాజ్, బీఎస్సీ కంప్యూటర్స్‌లో వర్షిత, బీకాం కంప్యూటర్స్‌లో హర్షిత, హార్టికల్చర్‌లో అర్చనతో పాటు ముఫీరా, అఫ్రా, సమీనా, రజియా, సీమ అంజూమ్ అత్యధిక మార్కులను సాధించినట్టు తెలిపారు. వీరిని అధ్యాపక బృందం అభినందించింది.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన


మాట్లాడుతున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతపై పూర్తి అవగాహన కల్పించాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గర్భవతులు క్రమం తప్పకుండా వైద్యాధికారుల సలహాలు-సూచనలు పాటించేలా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు శ్రేయస్కరమని తెలియజేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల శుభ్రత, హైరిస్క్ గర్భవతుల సేవలు, మాతా-శిశుసంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సీహెచ్‌ఓ అనూరాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చౌకదుకాణం, పీహెచ్‌సీ తనిఖీ


చౌక దుకాణాన్ని తనిఖీ చేస్తున్న గంజిమాల దేవి

పెద్దపంజాణి: మండలంలోని బసవరాజు కండ్రిగ చౌకదుకాణం, పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆగస్టు నెలకు ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం, చక్కెర స్టాకు, కార్డుదారులకు పంపిణీ చేసిన సరుకుల వివరాలు, మిగిలిన బియ్యం, చక్కెర రిపోర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ శంకరన్, డీటీ శ్యాంప్రసాద్ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్, వైద్యాధికారి మురళి, వీఆర్వో శివ పాల్గొన్నారు.

మాతా-శిశు మరణాలకు అడ్డుకట్ట వేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మాతా-శిశు మరణాలకు అడ్డుకట్ట వేయడానికి అందరూ కృషి చేయాలని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికలాఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా గర్భం దాల్చినట్లు గుర్తిస్తే 12వారాల లోపు నమోదు చేయాలని, తరచూ వారికి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. అలాగే, గర్భిణులు రక్త హీనతతో బాధ పడుతున్న పక్షంలో వారికి మంచి పోషకాహారం, ఐరన్ టాబ్లెట్లు మొదలైనవి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, పురుషోత్తం ,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ స్వర్ణతేజ

పలమనేరు: ప్రస్తుత సమాజంలో చట్టాలపై మహిళలు సైతం అవగాహన పెంచుకోవాలని పలమనేరు ఎస్ఐ స్వర్ణతేజ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రీ మెటీరియల్ కౌన్సెలింగ్, ఓఎస్‌సీ సేవలు, హెల్ప్‌లైన్ నంబర్లు, వన్ స్టాప్ అడ్మినిస్ట్రేషన్ గురించి ఆమె వివరించారు. విద్యార్థినులు, మహిళలకు ఏదేని విపత్కర పరిస్థితులు ఎదురైతే ఈ సేవలను ఉపయోగించుకుని ఎలా బయటపడాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఉమెన్ కో-ఆర్డినేటర్ శశికళ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భారీ వర్షం..టమాటకు నష్టం


పొన్నిపెంట వద్ద టమాట తోటలో నిలిచిన వర్షపు నీరు

చౌడేపల్లె: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు టమాట, బీన్సు, కొత్తిమీర, వంకాయ తదితర తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు తోటల్లో నీరు నిండి వంకలు ప్రవహిస్తున్నాయి. అకాల వర్షం మేలు కంటే నష్టమే ఎక్కువ మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఆశాజనకంగా టమాట ధరలు ఉన్న తరుణంలోనే పంట దెబ్బతినడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షపునీటిని పొలాల నుంచి వెలుపలికి వెళ్లేలా చర్యలు చేపట్టారు.

జీఓ నంబర్ 77 రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ


పలమనేరు ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు

పలమనేరు: పీజీ విద్యను అభ్యసించడానికి డిగ్రీ విద్యార్థులకు అడ్డంకిగా మారిన జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు సంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తోందని విమర్శించారు. ఉన్నత విద్య గందరగోళంగా మారిందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ కారణంగా డిగ్రీ విద్యార్థులకు పీజీలో ఇక్కట్లు తప్పేలా లేవన్నారు. ఇక పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలమనేరు శాఖ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో భరత్, శిరీష, మౌనిక, వరలక్ష్మి, వినయ్, హరీష్, దివ్య, సమీనా తదితరులు పాల్గొన్నారు.

యాప్‌పై అవగాహన ర్యాలీ


మనమిత్ర యాప్‌పై అవవాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు కలిసి మంగళవారం మనమిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. వాట్సాప్ ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ఇదో మంచి వేదిక అని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

సదుం: మండలంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. ఉదయం 9.15 గంటలకు పెద్దూరు, 10 గంటలకు ఊటుపల్లె, 11 గంటలకు కంభంవారిపల్లె, 12 గంటలకు తాటిగుంటపాలెంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

బేబీ కిట్ల పంపిణీ


బేబీకిట్లను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వి.కోట : వి.కోట గ్రేటర్ లయన్స్ క్లబ్ మంగళవారం మాతృమూర్తులు, బాలింతలకు బేబీ కిట్లు, అల్పాహారాన్ని పంపిణీ చేసినట్లు ఆ సంస్థ మండలాధ్యక్షుడు డాక్టర్ తమీమ్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో బాలింతలకు, రోగులకు అల్పాహారంతోపాటు బాలింతలకు బేబీకిట్లను పంపిణీ చేశారు. ప్రతి నెల 5న సీహెచ్‌సీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఇంద్రేష్, సాదత్, లోకేష్, లాబురాం, మురుగేష్, హరి, చెనారాం, రమేష్, తీర్థంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు మారిన ఫీడర్ వేళలు


పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో పరిధిలోని పలమనేరు, వీ.కోట 220 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతుల దృష్ట్యా డివిజన్‌లోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, వీ.కోట మండలాల్లో రైతులకు ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఏ గ్రూపు వారికి పొద్దున 4 నుంచి 9 గంటల వరకు, బీ-గ్రూపులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు, సీ-గ్రూపులో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు సరఫరా చేయనున్నట్టు స్థానిక ట్రాన్స్‌కో ఏడీ జీవన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో త్వరలో కిడ్నీరోగుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి వెల్లడించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్ మమతారాణితో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో ఇంకనూ కల్పించాల్సిన వసతులు, సౌకర్యాలు..ఇత్యాది వాటిపై ఆయన చర్చించారు. ఈ ప్రాంతం నుంచి సుమారు 200మంది వరకూ డయాలసిస్ కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారని తెలిసిందని, అందుకే వీలైనంత త్వరగా డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే చెప్పారు. వైద్యుల నియామకం, ఇప్పటికే ఖాళీగా ఉన్న పోస్టులపై తాను సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కమిటీ సభ్యులు నాగరాజ, సుధాకర్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ


ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు

కుప్పం రూరల్: డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని చైర్‌పర్సన్ శాంతానాగరాజు తెలిపారు. ఈ ఫలితాల్లో బీకాం (సీఏ)లో హరీష్ 9.35, బీసీఏలో ప్రియాంక 9.05, ఎస్.భావన 9.05, బీఎస్సీ (సీఎస్)లో పూర్ణిమ 8.45, బీబీఏలో సింధు 8.4 పాయింట్లు సాధించినట్లు చెప్పారు. బీఎస్సీ (సీహెచ్‌ఈ)లో వణి 6.8 పాయింట్లు సాధించి కళాశాలలో మొదటి ర్యాంకు సాధించాడని తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్మన్ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.